

రిజర్వు స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పురపాలక సంఘ పరిధిలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆమోదం పొందిన లేఅవుట్లలో పురపాలక సంఘానికి అప్పగించిన రిజర్వు స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమేష్ హెచ్చరించారు. ఎపి పురపాలక సంఘ చట్టం, 1965 నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎటువంటి అనుమతులు పొందకుండా లేఅవుట్లు వేసిన వాటిని తక్షణమే తొలగించి సదరు స్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాటికి అయిన ఖర్చులను సదరు స్థల యజమానుల నుంచి వసూలు చేస్తామని చెప్పారు.


టిక్కెట్ల పంచాయితీ తీరేదెప్పుడు?

టిడిపిలో అభ్యర్థుల ప్రకటన పూర్తయిన తర్వాత జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో చిచ్చు రేగింది. శ్రీకాకుళంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, పాతపట్నంలో కలమట వెంకటరమణకు టిక్కెట్లు నిరాకరించడంతో పార్టీ శ్రేణులు కోపోద్రిక్తులయ్యారు. టిక్కెట్ల ప్రకటన తర్వాత నిర్వహించిన ఆత్మీయ సమావేశాలకు భారీగా కార్యకర్తలు తరలివచ్చి మద్దతు పలికారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిడి చేశారు. కొంతమంది మరో అడుగు ముందుకేసి పోటీకి ఆర్థికసాయంగా విరాళాలు సైతం ప్రకటించారు. అటు క్షేత్రస్థాయిలోనూ టిక్కెట్ నిరాకరించడంపై ఇన్‌ఛార్జిలపై సానుభూతి వ్యక్తమైంది. నియోజకవర్గాల్లో నెలకొన్న పార్టీ పరిస్థితులు పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఇటీవల ఇరువురిని హైదరాబాద్‌కు పిలిపించుకుని మాట్లాడిన విషయం తెలిసిందే. దీనిపై ఎటువంటి నిర్ణయం వెలువడనుందో అని అంతా ఎదురుచూస్తున్నారు.

- శ్రీకాకుళం, పాతపట్నంలో అభ్యర్థుల మార్పుపై ప్రచారం
- ఇటీవల చంద్రబాబును కలిసిన గుండ, కలమట కుటుంబాలు
- నాలుగు రోజులు వేచి చూడాలని అధినేత సూచన
- నిర్ణయం కోసం అంతా ఎదురుచూపులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో అభ్యర్థుల ప్రకటన తర్వాత నియోజకవర్గాల్లో ప్రచారం ఎలా సాగుతోందనే విషయంపై పార్టీ అధిష్టానం దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం. పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో పెద్దగా ప్రచారం జరగడం లేదని పార్టీకి ఫీడ్‌బ్యాక్ వెళ్లింది. రెండు నియోజకవర్గాల్లోని అత్యధిక మంది కార్యకర్తలు ప్రచారం సరిగా జరగడం లేదని, అభ్యర్థి ఎంపికలో మీరు తప్పు చేశారంటూ ఫోన్ చేసిన వారికి తిరిగి చెప్తున్నట్లు తెలిసింది. తమ నియోజకవర్గంలో అభ్యర్థులను మార్చకపోతే కష్టమని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పార్టీ నాన్చివేత ధోరణి అవలంభించడంతో శ్రేణుల్లో కొంత గందరగోళం నెలకొంది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ రెండు గ్రూపులుగా చీలింది. ఆత్మీయ సమావేశాలు, ర్యాలీలు, ఇన్‌ఛార్జిలు నిర్వహించే సమావేశాలకు కొంతమంది హాజరవుతుంటే మరికొంతమంది కొత్త అభ్యర్థుల వెంట తిరుగుతున్నారు. తటస్థ కార్యకర్తలు మాత్రం ఎటు వెళ్లాలో తెలియక సందిగ్ధంలో ఉన్నారు. అభ్యర్థుల అంశాన్ని తేల్చకుండా ఎంత నాన్చితే పార్టీకి అంత నష్టం చేకూరుతుందనే అభిప్రాయం పార్టీ నాయకుల నుంచి వినిపిస్తోంది.



ఆ రెండు చోట్ల ప్రచారంలో వెనుకబాటు

శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు ప్రచారంలో బాగా వెనుకబాటు కనిపిస్తోంది. రెండు నియోజకవర్గాల్లో ఏళ్ల తరబడి రాజకీయాల్లో ఉండడంతో కేడర్ అంతా ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలనే అంటిపెట్టకుని ఉంది. ఇన్‌ఛార్జిలపై కాస్తోకూస్తో వ్యతిరేకత ఉన్న వారు కొత్త అభ్యర్థుల వెంట వెళ్తున్నారు. వార్డులు, గ్రామాల్లో సహకారం లేకపోవడంతో ప్రచారం ఊపందుకోవడం లేదు. దీంతో కార్యకర్తల్లో నిస్తేజం అలుముకుంది. నియోజకవర్గంలో ప్రచారం సరిగా జరగడం లేదని అధిష్టానం దృష్టికి వెళ్లడంతో శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్ శ్రీకాకుళం నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొత్త అభ్యర్థి మామిడి గోవిందరావు కొద్దిరోజులుగా ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. మరో వైపు గ్రూపుల పోరు, ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నా... వైసిపి అభ్యర్థులు ప్రచారంలో మాత్రం దూసుకు పోవడంతో తమ పరిస్థితేమిటో తెలియకపోవడంతో టిడిపి శ్రేణులు మదనపడుతున్నాయి.

ఎవరికీ నొప్పించకుండా ఎంపీ ప్రచారం

శ్రీకాకుళం ఎంపీ స్థానం నుంచి మూడోసారి పోటీ పడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు ఎవరినీ నొప్పించకుండా ప్రచారం సాగిస్తున్నారు. సీట్ల పంచాయితీ ఉన్న నియోజకవర్గాలను పక్కనపెట్టి మిగిలిన నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. పలాస, టెక్కలి, ఆమదాలవలస ప్రాంతాల్లో ప్రచారానికే అధిక సమయం వెచ్చిస్తున్నారు. టిడిపి అభ్యర్థుల ప్రకటన పూర్తయ్యాక ఇప్పటివరకు శ్రీకాకుళం, పాతపట్నం ని యోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొనలేదు. శ్రీకాకుళం నగరంలో గొండు శంకర్ ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీకి ఆయన హాజరవుతారని ప్రచారం జరిగినా ఆమదాలవలస, టెక్కలి ప్రాంతాల్లో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల అభ్యర్థుల అంశం తేలిన తర్వాతే ఇక్కడ ప్రచారంలో పాల్గొంటారన్న చర్చ కేడర్‌లో సాగుతోంది.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం

- 24 గంటల్లో బోర్ల మరమ్మతులు పూర్తి
- 'ఉపాధి' కూలి రూ.300కు పెంపు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి, ఉపాధి హామీ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేతిపంపుల మరమ్మతులను గుర్తించి 24 గంటల్లో పనులు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి నీటి సరఫరా వ్యవస్థ అయినా పనిచేసేలా ఉండాలని, సిపిడబ్ల్యుఎస్ స్కీమ్‌లన్నీ సక్రమంగా పనిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటి కొరత ఉన్న చోట్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు ఈ వేసవి నుంచి కొత్త కూలి అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రస్తుతం వారికి రోజుకు రూ.272 అందుతున్న కూలి రూ.300కు పెరగనుందని చెప్పారు. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి జిల్లాలో 1.82 లక్షల మంది ఉపాధి పనులకు హాజరవుతారని తెలిపారు. క్షేత్రస్థాయిలో చేపట్టే ఉపాధి పనులు ఆయా ఎంపిడిఒలు, ఉపాధి ఎపిడిలు పర్యవేక్షించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు, తాగునీటి సౌకర్యము కల్పించాలన్నారు. వేసవి డిమాండ్ దృష్ట్యా జిల్లాలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఇ జి.జె బెనహర్ తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి : మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

వైసిపిని తరిమికొట్టాలి

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి, సరుబుజ్జిలి

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ నియంతృత్వ పాలన సాగించిన వైసిపిని సార్వత్రిక ఎన్నికల్లో తరిమికొట్టాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ఎన్నికల శంఖారావం కార్యక్రమంలో భాగంగా టెక్కలి, సరుబుజ్జిలిలో శనివారం ప్రచారం చేపట్టారు. ఓపెన్ టాప్ జీపులో టెక్కలి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వైసిపి పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. అధికారులను అధికారాన్ని అడ్డం పెట్టుకొని దొంగ మార్గంలో గెలవాలని భావిస్తున్న వైసిపిని సుశిక్షితులైన టిడిపి కార్యకర్తలు ఎదుర్కోవాలన్నారు. ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారిని నిర్మించుకోలేని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం నియోజకవర్గంలో అవి చేశాను ఇవి చేశాను అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు తాగునీరును నియోజకవర్గ ప్రజలకు అందించే బాధ్యత తమదేనన్నారు. రాష్ట్రంలో ప్రజా కంటక పాలనకు చరమగీతం పాడి ప్రజా సంక్షేమ పాలన అందిస్తామని హామీనిచ్చారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ వంశధార నది నుంచి తాగునీటిని రొట్టవలసకు అందించేందుకు టిడిపి హయంలో రూ.60 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని ఆటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలా అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయబోమని, సంపదను సృష్టించి పథకాలను ఇంటింటికీ అందిస్తామని తెలిపారు. సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో తెలుగు యువత మండల అధ్యక్షులు తాడేల రాజారావు, మాజీ ఎంపిటిసి టి.వెంకటరమణ, సీనియర్ టిడిపి నాయకులు బెవర లక్ష్మణరావు ఆధ్వర్యంలో సుమారు 60 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరాయి. వీరికి ఎంపీ, రవికుమార్ టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్, జీరు భీమారావు, బోయిన్ రమేష్, జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, బిజెపి, జనసేన ఆమదాలవలస నియోజకవర్గ కన్వీనర్లు సూరపనాయుడు, రామ్మోహన్, టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఎంపీకి ఓటు వేయొద్దు

మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు/పలాస

జిల్లా అభివృద్ధికి పాటుపడని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ఓట్లు వేయొద్దని రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రజలను కోరారు. వజ్రపుకొత్తూరు మండలంలో స్వగ్రామమైన దేవునల్తాడలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం ప్రారంభించారు. వైసిపి ఎంపి అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పలాసలో మంత్రి కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా జిల్లాకు చేసిన పని ఒకటైనా రామ్మోహన్ నాయుడు చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. మత్స్యకారులను గుర్తించి తీర ప్రాంత, మత్స్యకారుల అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి పాటుపడుతున్నారని దీన్ని మత్స్యకారులు గుర్తించాలని కోరారు. తాతలు, తండ్రుల పేరు చెప్పుకొని ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, పేదింటిలో పుట్టి కష్టపడి చదివి జగన్ ఆశీస్సులతో ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవ చేసి ఓట్లు అడగడానికి తాను వచ్చానన్నారు.

వైసిపి ఎంపీ అభ్యర్థి తిలక్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి శ్రీదేవి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, మందస ఎంపిపి డి.దానయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీలు మద్దిలి హరినారాయణ, దున్న బాలరాజు, సర్పంచ్‌లు అత్తాడ గోపి, సీదిరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌ను మార్చాల్సిందే

- లేకుంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తాం
- వైసిపి నాయకుడు లుకలాపు



మాట్లాడుతున్న లుకలాపు అప్పలనాయుడు

ప్రజాశక్తి - లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను మార్చాలని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే అసంతృప్త నాయకులందరూ రాజీనామా చేయడంతో పాటు తమలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిల్చొంటారని హెచ్చరించారు. మండలంలోని పెద్దలింగాలవలసలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం ఎంతో కష్టపడి డబ్బులు ఖర్చు పెట్టి మరీ పార్టీ అభివృద్ధికి పాటుపడిన వారికి తీరని ద్రోహం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో కిరణ్ కుమార్ గెలుపు కోసం కష్టించి పనిచేస్తే, ఆయన ఎమ్మెల్యే కాగానే పార్టీ అభివృద్ధికి పాటుపడిన వారిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ, మండల స్థాయిలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తే కనీసం పట్టించుకున్న పాపానపోలేదని మండిపడ్డారు. తనను నమ్ముకొని పార్టీ కోసం తనతో కలిసి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. మళ్లీ ఎన్నికల వేళ ఇప్పుడు కొంతమందితో కిరణ్ కుమార్ సంప్రదింపులు చేస్తున్నారని, అటువంటి వాటికి అవకాశం ఇచ్చి మళ్లీ మోసపోయే పరిస్థితిలో తాము లేమన్నారు. తమ లక్ష్యం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడమన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాటే తమకు ముఖ్యమని, తామంతా కలసికట్టుగా పార్టీ గెలుపునకు పనిచేయాలంటే కిరణ్ కుమార్‌ని మార్చాలని డిమాండ్ చేశారు. జగన్ ముద్దు... కిరణ్ వద్దు అని అన్నారు. ఇదే నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని తేల్చిచెప్పారు. కిరణ్‌ను మార్చకపోతే త్వరలోనే నాలుగు మండలాలు నాయకులతో చర్చించి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామన్నారు. సమావేశంలో మురపాక ఎంపిటిసి తేనెల సురేష్, మాజీ సర్పంచ్‌లు పీరుకట్ల గొల్లరావు, గొర్లె రామినాయుడు, శివంగం నాగరాజు, వి.సత్యనారాయణ చిలకలపల్లి దాము తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందస్తు ఏర్పాట్లును సాధ్యమైన త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఫారం-6, 7, 8కి సంబంధించిన వివరాలను వివరించారు. రోజువారీ ఎంసిసి నివేదికలు పంపిస్తున్నామని తెలిపారు. సీజర్ బృందాల ద్వారా చేపడుతున్న చర్యలు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులపై సత్వర చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సి-విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను తెలిపారు.

ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, బంగారం తదితర వివరాలను వివరించారు. జిల్లాలో ఎటువంటి రాజకీయ హింసాయుత వాతావరణం లేదని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు, ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి టెక్ని వెర్స్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు స్థానిక ట్రిపుల్ ఐటిలో శ్రీకాకుళం, విజయనగరంలోని పలు కళాశాలల విద్యార్థులతో టెక్ని వెర్స్ టెక్నికల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఛాంబరులో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫెస్ట్‌లో ఇవి వెహికల్స్, డ్రోన్ సర్వేయింగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఫోన్ ఫార్జ్, టెక్ అరేనా, టెక్ ఫేట్, వెబ్ డిజైన్ తోన్, కస్పలే హాక్, కాగానితో కోడ్, అన్వేషక, మైండ్ టెంటాకల్స్, ఎలక్ట్రిక్కింగ్, సర్క్యూరిటీరి, స్పార్క్ యువర్ బ్రెయిన్, డిజైన్ డేర్చైతో ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. కాకుండా, విజ్ఞాన ప్రదర్శన, వినోద ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ

విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం, వినోదం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న ఈ ఫెస్ట్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ, చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, ఫెస్ట్ కన్వీనర్ వాసు, కో కన్వీనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టోల్ నంబరు.. హలో 1950

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపైనైనా సందేహాలు నివృత్తి చేసుకునేందుకు, ఫిర్యాదులు చేయడానికి కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబరు 1950ను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించి ఎవరైనా ఓటరు తమ సందేహాలు నివృత్తి చేసుకోవడానికి ఈ నంబరుకు ఫోన్ చేస్తే చాలు సమాధానం ఇచ్చేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటారు. అయితే టోల్ ఫ్రీ నంబరు 1950నే ఎన్నికల సంఘం ఎందుకు ఎంచుకుందన్న అనుమానం రావచ్చు. మన దేశంలో 1950 జనవరి 25న స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ ఏర్పాటైంది. ఇది ఎన్నికలకు సంబంధించినంత వరకు స్వతంత్రంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రతిసారీ సాధారణ ఎన్నికల సమయంలో దేశవ్యాప్తంగా 50 లక్షల మంది ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటుంది. దేశంలో మొదటిసారి సాధారణ ఎన్నికలను హిమాచల్ ప్రదేశ్‌లోని 'చిని'లో నిర్వహించారు. ఆ సంవత్సరాన్నే టోల్‌ఫ్రీ నంబరుగా 1950ను ఎన్నికల సంఘం ఉచిత సహాయ, ఫిర్యాదుల కోసం కేటాయిస్తోంది. ఈ సహాయ కేంద్రం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఫిర్యాదులు చేసేందుకు ప్రతి పౌరునికి హక్కు ఉంది. అలా అని అనవసర ఫిర్యాదులు చేయడం బాధ్యతారాహిత్యమవుతుంది. ఎన్నికల సమయంలో అధికారులు, ఉద్యోగులు నిబంధనలు పాటించకున్నా, అధికారులు ఎవరైనా రాజకీయ పార్టీలతో అంటకాగినా, వారు ఇచ్చే విందు, వినోదాల్లో పాల్గొన్నా ఫిర్యాదులు చేయొచ్చు. కొంతమంది అధికారులు దూర ప్రాంతాల నుంచి ఎన్నికల విధులకు వస్తుంటారు. పార్టీల నాయకులు వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేస్తుంటారు. అటువంటి వారిపైనా ఈ నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

ఎవరి మదిలో ఏముందో?



మండు వేసవిలో ఎన్నికల వడగాడ్పులు వచ్చేశాయి. ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారంలో మంటలు పుట్టించడానికి సిద్ధమవుతున్నాయి. జిల్లాలోని రాజకీయాలు అందుకు మినహాయింపు కాదు. ప్రచారంలో పార్టీలు ఎప్పటికప్పుడు సరికొత్త ఎత్తుగడలు వేసుకుంటూ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి సిద్ధమవుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ టెక్కలి శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. కేంద్ర మాజీ సహాయ మంత్రి కిల్లి కృపారాణి తాజాగా వైసిపికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆమె కోసమే టెక్కలి అభ్యర్థిని ఆ పార్టీ ప్రకటించలేదని తెలిసింది. రాజకీయంలో అందలం ఎక్కించడమే కాదు, అవమానాలు ఉంటాయని ఆమె ఆలస్యంగా గుర్తించినట్లు ఉంది. ప్రజా బలం పునాదిగా ఉంటే అవమానాలు తిప్పికొట్టడమే కాదు ప్రతిఘటించవచ్చని ఆమె భవిష్యత్‌లోనైనా రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. రాజకీయాల్లో గెలుపోటములు సహజ ప్రక్రియగా చూస్తేనే భవిష్యత్‌పై ఆశలు చిగురిస్తుంటాయి. జిల్లాలో వైసిపి రాజకీయాల్లో ఆమదాలవలస నియోజకవర్గంలోనే ఇప్పటికి తిరుగుబాటు అభ్యర్థి బరిలో నిలిచారు. టిక్కెట్ ఆశించిన సువ్వారి గాంధీ తాను స్వతంత్ర అభ్యర్థినంటూ ప్రచారంలో మునిగిపోయారు. నామినేషన్ల ఉపసంహరణ నాటికి ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో చూడాల్సి ఉంది. గాంధీ అభ్యర్థిత్వం వల్ల వైసిపికే కాదు, టిడిపికీ కొంత ప్రభావం చూపుతుందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ఆ లోటును టిడిపి బూర్జ మండలంలో భర్తీ చేస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇంతకుముందే పీరుకట్ల కుటుంబం టిడిపిలో చేరడంతో ఆ ప్రభావం ఉంటుందని చెప్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తర్వాత వైసిపి నుంచి తిరుగుబాటు అభ్యర్థులుగా ఎవరు రంగంలో నిలుస్తారన్నది చూడాల్సి ఉంది. ప్రధానంగా గ్రూపుల కొట్లాటలో మునిగి ఉన్న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల నుంచి ఎవరైనా బరిలో దిగడానికి అవకాశం ఉందన్న ప్రచారం ఇప్పటికే ఉంది. నేటివరకు ఆ స్థాయి గ్రూపులు రాజ్యమేలడమే అందుకు కారణంగా కనిపిస్తోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రెడ్డిక సామాజిక తరగతి అసంతృప్తితో ఉందని ఆ పార్టీ శ్రేణులు చెప్తున్నాయి.

జిల్లాలో అధికార పార్టీలోనే రచ్చ ఎక్కువగా ఉంటుందని పలువురు భావించారు. అందుకు భిన్నంగా టిడిపిలోనే రచ్చ ఎక్కువైంది. ప్రధానంగా శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల అభ్యర్థులను మార్చడం సరికొత్త రచ్చకు దారితీసింది. ఆగ్రహంతో పార్టీ సామగ్రిని విధ్వంసం చేయడం, తగులబెట్టడం చూశాం. టిక్కెట్ వస్తుందనుకున్న ఇద్దరు అభ్యర్థులు నేరుగా అధినేత చంద్రబాబు నాయుడును కలిసి వచ్చారు. ఉగాది లోగా మార్పు ఉంటుందని ఇద్దరూ భావిస్తున్నారు. శ్రీకాకుళంలో మార్పు లేకుంటే మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తారని ఆ పార్టీలో ప్రచారం ఉంది. పాతపట్నంలో ఏమైనా జరగవచ్చన్న వాతావరణం ఉంది. ఈ రెండు నియోజక వర్గాల్లోనే స్వతంత్ర అభ్యర్థులుగా తిరుగుబాటు చేసి బరిలో నిలిస్తే దాని ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపైనా పడే అవకాశం ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ టిడిపి ఓటు బ్యాంకు ఖాతాలు తగ్గిపోయే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. టెక్కలి నియోజకవర్గంలో సరికొత్త రాజకీయాల్లో వైసిపి ఓటు బ్యాంకు ఖాతాలు చెదిరిపోతాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగుతాయని చెప్పలేం. నామినేషన్ల ఘట్టం మొదలయ్యే నాటికి సరికొత్త పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌తో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ బరిలో నిలుస్తోంది. జిల్లాలో కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లిన వారిలో కిల్లి కృపారాణి తప్ప చెప్పుకోదగ్గ నేతలెవరూ తిరిగి హస్తం గూటికి చేరలేదు. ఈ ఎన్నికలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తిరిగి జవసత్వాలను కూడతీసుకోవడానికి ఏమేరకు ఉపయోగపడతాయన్నది చూడాల్సి ఉంది.

జిల్లాలో ప్రధాన పార్టీలు ప్రచార తీరు కన్నా చెప్తున్న అంశాలు ప్రధానంగా చర్చనీయాంశంగా ఉన్నాయి. ఓటర్లు ఎలా స్పందించినా, వైసిపిలో సానుకూల ప్రచారం కనిపిస్తోంది. టిడిపిలో విమర్శల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. తామొస్తే ఏం చేస్తామన్నది ప్రచారంలో వెనుకబడింది. రాష్ట్ర విభజన తర్వాత మొదటి ఐదేళ్ల టిడిపి పాలనలో జిల్లాకు ఒరగబెట్టిందేమీ లేదు. జిల్లాకు సంబంధించి సుమారు పది ప్రాజెక్టులు శాసనసభలో ప్రకటించి పుస్తకాలు ముద్రించినా అవి గడప దాటలేదు. ఏ ఒక్కటీ కనీసం శంకుస్థాపనకైనా నోచుకోలేదు. అందువల్ల టిడిపికి జిల్లాకు ఇది చేశామని చెప్పుకోవడానికి ఏమీ లేదు. మళ్లీ వస్తే ఏం చేస్తామని చెప్తున్న దానికి ప్రజలు ఎంతవరకు విశ్వసిస్తారో ఫలితాలు వస్తే గానీ తెలీదు. అందువల్ల ఎవరి మదిలో ఏముందో చెప్పలేని వాతావరణం నెలకొంది. అభ్యర్థులు అందరిలోనూ భయం ఉంది. ఓటర్లు ఎవరికి అభయం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారన్నది చూడాల్సి ఉంది.

- సత్తారు భాస్కరరావు


టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టిడిపికి వలసలు అధికమవుతున్నాయి. మండలంలోని బెలగాం పంచాయతీ బసవకొత్తూరు, కంచిలి మండలం జాడుపూడి పంచాయతీ బసవపుట్టుగ గ్రామాల నుంచి 220 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా బసవకొత్తూరు, బసవపుట్టుగ గ్రామాల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుడ్డా వాసుదేవ్, జోగమ్మ, బసవ రామయ్య, పెద్దిరెడ్డి రాఘవులు, పిట్ట హేమలయ్య, పిట్ట భుజంగరావు, బసవ జానకిరావు, తిప్పన తారకేసు, తాడి బృందావనం, బుడ్డ తేజం, తిప్పన కృష్ణారావు, తిప్పన భైరాగి, బసవ కృష్ణారావు పాల్గొన్నారు.


రాజీనామా పత్రాలను అందజేస్తున్న వాలంటీర్లు

23 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు చెందిన 23 గ్రామ వాలంటీర్లు శనివారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకుల ఆధ్వర్యాన రాజీనామ పత్రాలను ఆయా సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి సేవ చేస్తుంటే... తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నారని అన్నారు. పింఛన్లు ఇవ్వకుండా తమను అడ్డుకోవడం కలచివేసిందన్నారు. తమ వద్ద నుంచి సెల్‌ఫోన్లు, సిమ్‌లు, డివైజ్లు తీసుకున్నారని, ఉమెన్ ట్రాఫికింగ్ చేస్తున్నామని అంటున్నారని అన్నారు. తమకు జీవనోపాధి కల్పించి అవకాశం ఇచ్చిన జగనన్న రుణం తీర్చుకుంటామని, మళ్లీ జగనన్న ప్రభుత్వంలో మరెన్ని సంక్షేమ పథకాలు కచ్చితంగా పేదలకు అందడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో మండల విప్ బొడ్డు అప్పన్న, చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఇచ్ఛాపురం : రానున్న ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో కన్వీనర్లతో, గృహసారథులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిని పిరియా విజయ, నియోజకవర్గ పరిశీలకులు చింతాడ రావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లు మాట్లాడారు. వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ అందరినీ సమన్వయ చేసుకుంటూ ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, ఎపి సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- కొత్తూరు

మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి గోగుల వరప్రసాదరావు, సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్, కిరణ్‌కుమార్‌లు ఎమ్మెల్యే సమక్షంలో శనివారం వైసిపిలోకి చేశారు. వీరు రెండేళ్ల నుంచి ఎమ్మెల్యేకు దూరంగా ఉన్నారు. అలాగే మెట్టూరు బిట్- 3లో టిడిపి నుంచి దాసరికి మంగన్న, కాళిదాసు, ఎస్.సాయిరాజు, డి.సవరయ్య, బి.శ్రీనివాసరావుతో పాటు 150 కుటుంబాలు వైసిపిలో చేరాయి. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కురిమి రాజేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్‌పిటిసి కమక భాగ్యవతి, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎమ్మెల్యే కుమారుడు శ్రావణ్‌కుమార్, సర్పంచ్‌లు పడాల కృష్ణవేణి, కె.రత్నాలు, పి.సాధుబాబు, ఎన్.బాలకృష్ణ, ధర్మారావు, మొజ్జాడ చక్రపాణి పాల్గొన్నారు.


బూర్జ : ఇంటింటా ప్రచారం చేస్తున్న గాంధీ

గ్రామాల్లో 'సువ్వారి' ప్రచారం

బూర్జ : అవినీతి నాయకులను తరిమికొట్టి నియోజకవర్గాన్ని ప్రజలే కాపాడుకోవాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని టిడిఆర్ పేట, కొల్లివలస గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన 20 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో అభివృద్ధి ఎంత జరిగిందో ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఆ ఆద్దరు నాయుకులే అభివృద్ధి చెందారని విమర్శించారు. కార్యక్రమంలో కె.రాజారావు, గణేష్, తవుడు, బులేసు, వెంకటరమణ, అప్పారావు, వెంకటరావు, రాంబాబు, ఆదినారాయణ, రవి, ప్రశాంత్, మోహన్ పాల్గొన్నారు.

పొందూరు: మండలం కేశవదాసుపురంలో స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ తరుపున బుధవారం ఆయన భార్య, ఎంపిటిసి సువ్వారి దివ్య ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సువ్వారి గాంధీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సువ్వారి ఢిల్లీశ్వరరావు, సువర్ణ, మొకర జాగారావు, దుర్గారావు, పిన్నింటి అప్పలనాయుడు, కిరణ్, ప్రసాద్, త్రినాథ్, రాజు, హరనాథ్ పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

ఇచ్ఛాపురం: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మండల సాధారణ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ వై.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన శనివారం సాధారణ మండల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉండడంతో ఎటువంటి చర్చలు, తీర్మానాలు చేయకూడదని అన్నారు. అందుకే సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపిటిసిలు, సర్పంచ్‌లు వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ నీటి సరఫరా పైపులైన్లు చాలాచోట్ల లీక్‌అవుతున్నాయని, దానిపై దృష్టి సారించాలని అన్నారు. జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.

'వైసిపితో అభివృద్ధి, సంక్షేమం'


పోలాకి : ప్రచారం చేస్తున్న కృష్ణదాస్


లావేరు : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- పొందూరు

అభివృద్ధి, సంక్షేమం వైసిపితోనే సాధ్యమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం తుంగపేటలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. ఈయనతో పాటు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని జి.కె.వలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి మరొక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పిఎసిఎస్ డైరెక్టర్ నక్క కన్నబాబు పాల్గొన్నారు.

లావేరు: పోతయ్యవలస, వెంకటాపురం పంచాయతీల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లువేసి తనను గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, డి.రాజనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, బురాడ చిన్నారావు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని రాళ్లపాడు, ముప్పిడి గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిసి సెల్ జోనల్ రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, వైసిపి సిఇసి సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పెద్దలు పాగోటి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ డైలీ మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యాపారులను కలుసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, వార్డు కౌన్సిలర్లు జగన్నాథ్‌రెడ్డి, నీలాపు లక్ష్మి, పరపతి మంజులత, సిగ్గు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరం పంచాయతీలో సూరాడవానిపేట, మరువాడ పంచాయతీల్లో ఎం.మరువాడ, డి.మరువాడ, చొక్కరవానిపేట, గుడ్డిమీదపేటల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైస్ ఎంపిపి ప్రతినిధులు నక్క భీమారావు, పొందల రామకృష్ణ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కోత సతీష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి పంచాయతీలో వంశధార కాలనీ, రోటరీనగర్ 1,2,3,4లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండేల సుజాత, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, అనంతయ్య, చింతాడ గణపతి, టెక్కలి టౌన్ అధ్యక్షులు తమ్మన్నగారి కిరణ్, మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయ్, జెసిఎస్ మండల కన్వీనర్ శిగిలిపల్లి మోహన్, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం పాల్గొన్నారు.


పొందూరు : ప్రచారం చేస్తున్న స్పీకర్ సీతారాం


సంతబొమ్మాళి : ప్రచారం చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్


ఇచ్ఛాపురం : ప్రచారం చేస్తున్న విజయ

కోటబొమ్మాళి: వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పి.తిలక్‌లకు మద్దతుగా ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళిలు కొత్తపేట పంచాయతీ ఇందిరమ్మ కాలనీ, తారకరామ కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దుక్క రోజా, జెసిఎస్ మండల కన్వీనర్ నాగభూషణ్, జిల్లా రైతు భరోసా అడ్వైయిజరీ కమిటీ సభ్యులు కవిటి రామరాజు, సర్పంచ్ రామపాత్రుని సావిత్రి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ రాజు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థుల విస్తృత ప్రచారం


సోంపేట : అశోక్‌కు తిలకం దిద్దుతున్న మహిళ


శ్రీకాకుళం అర్బన్ : సైకిల్ యాత్రలో పాల్గొన్న శంకర్

ప్రజాశక్తి- సోంపేట

రానున్న ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని, చంద్రబాబును మరలా ముఖ్యమంత్రిని చేయాలని టిడిపి ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ నాయకులు దాసరి రాజు కోరారు. సోంపేట పట్టణంలోని పల్లివీధి ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను గురించి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శేఖర్, చిత్రాడ శ్రీను, మద్దెల నాగేశ్వరరావు, వి.గాంధీ, రెళ్ల శ్రీను, మడ్డు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి మండలంలోని గుప్పాడపేట పంచాయతీలోకొవిరిపేట, గుప్పంపిడిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకులు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పెంటిభద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడులకు మద్దతుగా టిడిపి నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, లోడగల కామేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బడ్డ నాగరాజు గారు సప్ప నవీన్, జనసేన నాయకులు అట్టాడ వాసుదేవ్, నబిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : టిడిపి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషలను గెలిపించాలని కోరుతూ మండలంలోని కొత్తపేటలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, మాజీ ఎంపిపి వసంతస్వామి, గోవిందు పాపారావు, దున్న షణ్ముఖరావు, అట్టాడ రఘు, కంబాల దానేష్, చింతా యోగేష్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రత్యర్థిగా ఉన్న రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అసత్య ఆరోపణలు, అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నారని, ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా కుల సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్న ధర్మానపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని టిడిపి కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. శనివారం నగరంలోని 80 అడుగుల రోడ్డు నుంచి పాత బస్టాండ్, ఏడు రోడ్ల జంక్షన్, డేఅండ్‌నైట్, రైతు బజారు, రామలక్ష్మణ కూడలి, సూర్యమహల్, అరసవల్లి జంక్షన్ మీదుగా టిడిపి కార్యాలయం వరకు బిజెపి, జనసేన నాయకులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో ఓటమి భయంతో తనపై సోషల్ మీడియా వేదికగా మార్ఫింగులతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి హోదాలో ఉండి గడచిన ఐదేళ్లలో స్టేడియం పున: నిర్మాణం, శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, గార మండలంలో ఎత్తిపోతల పథకం, వంతెన నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. ప్రజలు టిడిపి కూటమికి పట్టం కట్టాలన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, శంకర్, బిజెపి నాయకులు వేణుగోపాల్, ఉమా మహేశ్వరరావు, టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, బొణిగి భాస్కరరావు పాల్గొన్నారు.


పోలాకి : ప్రచారం చేస్తున్న రమణమూర్తి

ఆస్పత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి- పొందూరు


పింఛను అందజేస్తున్న లక్ష్మీనారాయణ

రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలం ధర్మపురంకు చెందిన పింఛనుదారుడు మొద లవలస వాసు దేవరావుకు శనివారం విఎఎ బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ పింఛన్‌ను అందజేశారు. కొద్దిరోజులుగా పింఛనుదారుడు అనారోగ్యానికి గురి కాగా ఆయనకు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్సను అందిస్తున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు ఆస్పత్రికి వెళ్లి లబ్దిదారునికి పింఛన్‌ను అందజేశారు.

పంచదార పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని గూనపాలెంలో రంజాన్‌ను పురష్కరించుకుని తన తండ్రి ఖలీల్‌భాయ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఇమ్రాన్ భాష 600 కుటుంబాలకు శనివారం సేమియా, పంచదార పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా రుచులు అందించాలన్న లక్ష్యంతో వీటిని అందిస్తున్నామన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు చెందిన పలువురు హాజరయ్యారు. కార్యక్రమంలో ఖలీల్ భాయ్ సతిమణి జబిన బెగం, కుమార్తెలు, సురేష్, బాబ్జీ పాల్గొన్నారు.

వ్యాపారాల్లో ట్యాలీ కీలకం

శ్రీకాకుళం అర్బన్ : వ్యాపార, వాణిజ్య రంగాల్లో అకౌంటింగ్, ట్యాలీ అత్యంత కీలకమని, వివిధ ప్రభుత్వ పన్నులు, ఆదాయ, వ్యయాలపై వ్యాపార వేత్తలకు అంచనా వేసుకునేందుకు ఖాతాలను క్రమబద్దీకరించుకునేందుకు దోహదపడుతుందని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. శనివారం కళాశాలలో వాణిజ్య శాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు అకౌంటింగ్, ట్యాలీ ప్యాకేజ్ సర్టిఫికెట్ ప్రజెంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈకోర్సు నేర్చుకోవడం వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్ నారాయణ మాట్లాడుతూ కామర్స్ డిపార్ట్మెంట్ ప్రతి ఏటా జాబ్ ఓరియెంటెడ్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఒడి ఎల్.కృష్ణారావు యాప్ టెక్ ఫ్యాకల్టీ ఎన్.సంపత్ కుమార్, కళాశాల కో-ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, లలితా బాయి, బి.సంతోషి పట్నాయక్, పావని పాల్గొన్నారు.


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్


'క్వాలిటీ కియోస్కో'కు 33 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2023-24లో ఇసిఇ, సిఎస్ఇ, ఐటి కోర్సులు పూర్తి చేసిన 33 మంది విద్యార్థులు ముంబై కేంద్రంగా పనిచేస్తున్న క్వాలిటీ కియోస్కో టెక్నాలజీస్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించిన అనంతరం వీరిని ఎంపిక చేస్తూ క్వాలిటీ కియోస్కో టెక్నాలజీస్ జాబితాను కళాశాలకు పంపిందన్నారు. వార్షిక వేతనంగా ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు వరకు చెల్లించేందుకు ఆ కంపెనీ అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అభినందిస్తూ క్రమశిక్షణతో శ్రమించి పనిచేస్తూ ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ బి.రామారావు, సిఎస్ఇ హెచ్‌డి డాక్టర్ యు.డి.ప్రసన్న, ఐటి హెచ్‌డి డాక్టర్ వై.రమేష్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.కుమార్‌లు అభినందించారు.


అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గొడవలకు తావివ్వొద్దు


బూర్జ : గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి- బూర్జ

త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ యాదవ్ కోరారు. శనివారం మండలంలోని ఉప్పినివలసలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తగాదాలకు, కొట్లాటకు పోవరాదని సూచించారు. కుటుంబ భద్రత, భవిష్యత్ కోసం ఆలోచన చేసి శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బూర్జ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన చిన్న జొన్నవలసలో ఎస్ఐ వెంకటేష్ ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలం వి.ఆర్.గూడెంలో ఎస్ఐ రవికుమార్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సువ్వారి రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


చలివేంద్రాలు ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి కాలం పూర్తయ్యే వరకూ చలివేంద్రంతో రోజూ స్వచ్ఛమైన తాగునీటిని, మజ్జిగను అందించనున్నట్లు తెలిపారు. ఏటా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ ఏడాదీ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. జిల్లాలో ఎండలు బాగా పెరుగుతున్న దష్ట్యా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. బయటకు వచ్చేటప్పుడు తలపై టోపీ ధరించాలని, లేకుంటే గొడుగు పట్టుకుని వెళ్లాలని చెప్పారు.

అలాగే పాత బస్టాండ్ కూడలి వద్ద మార్కెట్ ప్రాంగణంలో 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ జి.రాంబాబు, లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ ప్యాకెట్లను అందించారు. జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, జెసిఐ ప్రెసిడెంట్ శివతేజ పాల్గొన్నారు.

పలాస : స్థానిక ఇందిరా చౌక వద్ద లయన్స్‌క్లబ్ క్యాజు ల్యాండ్ అధ్యక్షులు మల్లా జయశ్రీ చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మల్లా భాస్కరరావు, కార్యదర్శి తర్లనా శ్వేతకుమారి, కోశాధికారి మల్లా సంతోషి, తూముల గాయత్రి, తాళసు లత పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం బస్సు సెల్టర్ వద్ద విఆర్ఒ అన్నాజీరావు, కార్యదర్శి కె.వి.ప్రసాద్‌లు చలివేంద్రాన్ని ప్రారంభించారు. డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ఇలా అయితే ఆందోళన చేస్తాం

పలాస: వైసిపి నాయకులు అధికారుల వద్ద ఒక్క రోజుకు అనుమతి తీసుకుని పది రోజుల వరకు జెండాలు కడుతున్నారని, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు ఆరోపించారు. కాశీబుగ్గలో లొడగల కామేశ్వరరావు అధ్యక్షతన క్లస్టర్ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులకు చెబుతున్న స్పందించడం లేదన్నారు. ఇదే విధానం కొనసాగితే మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దౌర్జన్యాలు, శవ రాజకీయాలు చేసే వైసిపి ప్రభుత్వం పోవాలంటే గౌతు శిరీషను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చంద్రశేఖర్ త్యాడి, గోళ చంద్రరావు, హనుమంతు మురళి, నిత్యానంద పండ, శివ, రాజేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కామేశ్వరరావు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- మందస

తీవ్రమైన నెలసరి కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, మందస పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిక్కిడిగాంకు చెందిన బలియాశెట్టి కృష్ణ 13 ఏళ్ల క్రితం సంగీత (27) అనే యువతిను ప్రేమ వివాహం చేసుకున్నాడు. స్వగ్రామంలో భార్యాభర్తలు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా నెసరి కడుపునొప్పితో బాధపడుతుంది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో మనస్తాపానికి గురైంది. భర్త కృష్ణ జీడి తోటకు వెళ్లడంతో గన్నేరు పప్పు తినేసి అపస్మారకస్థితికి చేరుకుంది. భర్త ఇంటికి వచ్చి చూడగా అపస్మారకస్థితిలో ఉన్న భార్య సంగీతను హరిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సంగీతకు కుమారుడు ప్రశాంతి, కుమార్తె గొంగలు ఉన్నారు. భర్త కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మందస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పరామర్శిస్తున్న అశోక్ గజపతిరాజు

అచ్చెన్నకు పరామర్శ

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు నిమ్మడ వెళ్లి అచ్చెన్నాయుడును శనివారం పరామర్శించారు. ముందుగా కళావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే పాతపట్నం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు, చిన్నసాన ఎంపిటిసి నంబళ్ల రాజశేఖర్ కూడా అచ్చెన్నను పరామర్శించారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, కింజరాపు ప్రభాకర్, మాజీ ఎంపిపి వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు ఉన్నారు.

పొందూరు: టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ ఇటీవల మృతి చెందడంతో శనివారం నిమ్మాడలోని ఆయన స్వగృహంలో పొందూరు టిడిపి నాయకులు ఆయనను కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, నాయకులు చౌదరి వరదరాజులు, సీపాన భాస్కరరావు ఉన్నారు.


కంప్యూటర్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

కంప్యూటర్ అందజేత

నౌపడ : నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, దేవిశ్రీ ఫుడ్స్ సంయుక్తంగా రూ.60 వేలు విలువ చేసే కంప్యూటర్ పరికరాలను శనివారం అందజేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విజ్ఞానం ప్రతి విద్యార్థికీ అవసరమని, విద్యార్థులకు అవసరమైన ఒక కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌లను బిగ్ హెల్ప్ నౌపడ ప్రాజెక్టు చైర్మన్ రాజా, డైరెక్టర్ జయకృష్ణారెడ్డిలు ప్రిన్సిపాల్ భీమేశ్వరరావు, నారాయణరావులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంస్థ వ్యవస్థాపకులు చాంద్ పాషా ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. కంప్యూటర్ పరికరాలు అందించిన దేవిశ్రీ ఫుడ్స్‌కు, బిగ్ హెల్ప్ సంస్థకు అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి వెంకటరావు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

నందిగాం : మండలంలోని నర్సిపురం. ఆర్జిబొడ్డపాడు గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ శనివారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఎఫ్ స్వాతి, గ్రామైక్య సంఘం సభ్యులు, గ్రామ సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ మనోరత్నం పిలుపునిచ్చారు. స్వీప్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా వెలుగు కార్యాలయం నుంచి మెళియాపుట్టి మూడు రోడ్ల కూడలి వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం లలిత, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వద్దకే ప్రచారం



ఉపాధి కూలీలకు పోస్టర్లు పంపిణీ చేస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా గ్రామాల్లో ప్రస్తుతం ఉపాధి పథకం ద్వారా పనులు జోరుగా నిర్వహిస్తుండడంతో గ్రామాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో అభ్యర్థులు ఉపాధి కూలీలు ఉన్న చెరువుల వద్దకే వెళ్లి తమ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ప్రజలకు అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై వివరిస్తున్నారు. శనివారం టిడిపి అభ్యర్థి సరుబుజ్జిలి మండలంలో కూన రవికుమార్ నిర్వహించిన ప్రచారంలో ఉదయం మూలసవలాపురం గ్రామం వద్ద చెరువులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం రొట్టవలస గ్రామ పంచాయతీ అవతరాబాద్ చెరువు వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి టిడిపి ప్రభుత్వం ఏర్పడితే 50 ఏళ్ల దాటిన బిసిలకు చంద్రబాబు రూ.4 వేలు పింఛను అందించడం జరుగుతుందని తెలిపారు. దీంతో ఉపాధి కూలీలకు కొంతమేర ఉపశమనం కలుగుతుందని ఆయన వివరించారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా శనివారం ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఉన్న ఫ్లై ఓవర్ వద్ద సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ వాహనదారులు రవాణా శాఖ, పోలీసులు తెలిపిన నిబంధనల మేరకు అన్ని పత్రాలు అందుబాటులో ఉంచి రాకపోకలు సాగించాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. రూ.50 వేలు దాటి నగదును తీసుకువెళ్తే సంబంధిత పత్రాలు తప్పకుండా కలిగి ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మల్లేశ్వరరావు

కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు, రణస్థలం మండలాల్లో వాళ్లేపేట, సావళ్లపేట, కెల్లపేట, మహంతిపాలెం తదితర గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, పింఛన్లు, ఉద్యోగ అవకాశాలు, ప్రాజెక్టులు వంటి సంక్షేమ పథకాలు ఉండేవని, రాష్ట్రంలో వైసిపి, కేంద్రంలో బిజెపి పదేళ్ల అధికారంలో ఉండి చేసిందేమి లేదన్నారు.

ఆదరిస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి- లావేరు

నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఆదరించాలని ఎన్‌డిఎ కూటమి ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావు అభ్యర్థించారు. శనివారం మండలంలోని తాళ్లవలస, గురుగుబిల్లి, లావేరు అప్పాపురం, వెంకటాపురం, పెదలింగాలవలస, పోతయ్యవలస, కొత్తకోట, గోవిందపురం తదితర పంచాయతీల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, విజయనగరం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడును ఓట్లువేసి గెలిపించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న తోటపల్లి మడ్డువలస సాగునీటి కాలువలు పూర్తి చేయించి రైతులకు సాగునీటి అందజేస్తామన్నారు. బుడుమురు నారాయణ సాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పిన్నింటి మధుబాబు, టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత, ఎచ్చెర్ల జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, కలిశెట్టి సూర్యనారాయణ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాతలు... ప్రాణదాతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో రక్తం కొరత ఎక్కువగా ఉందని, మండు టెండలను దృష్టిలో పెట్టుకొని ప్రజల ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో పద్మపూజిత ఆటో ఫైనాన్స్ సంస్థ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు ఎండి ఫణికుమార్ తెలిపారు. శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన జరిగిన శిబిరంలో 120 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని విశ్రాంత జాయింట్ కలెక్టర్ పి.రజనీ కాంతరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావులు ప్రారంభించారు. శిబిరంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులంతా ఏకమై స్వచ్ఛందంగా రక్త దానం చేయడం హర్షణీయమన్నారు. యువత అపోహలు వీడి రక్తదానం చేయాలన్నారు. ఈ శిబిరంలో కలక్షన్ మేనేజర్ ఆనంద్ గౌడ్, సేల్స్ క్లస్టర్ వెంకటేష్, కృష్ణ, క్యాషియర్ హరి, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయరాం

వాలంటీర్లు వైసిపి సేవకులు కాదు

ఐటిడిపి జిల్లా అధ్యక్షులు విజయరాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజా ధనంతో జీతాలు తీసుకుంటున్న వాలంటీర్లు వైసిపి సేవకులు కాదని, గ్రామ స్వరాజ్య సేవకులుగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని ఐటిడిపి జిల్లా అధ్యక్షులు ప్రధాన విజయరాం అన్నారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వాలంటీర్లను వైసిపి ఎన్నికల సిబ్బందిగా వాడుకోవాలని కుట్ర చేస్తోందని అన్నారు. వాలంటీర్లను పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సకాలంలో పింఛన్లు ఇవ్వకుండా కాలయాపన చేసి వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు కార్యాలయానికి మండుటెండలో రప్పించి టిడిపి వల్లే ఈ పరిస్థితి నెలకొందని ప్రచారం చేయడం సరికాదన్నారు. వాలంటీర్లు రాజీనామా చేయాలన్న ఒత్తిడి వైసిపి నాయకుల నుంచి ఎదురవుతోందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, భోగిని భాస్కరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

లావేరు : మండలంలోని పాతకుంకాం సర్పంచ్ శెటికం వెంకటరమణను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటరమణను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు ఉన్నారు.



వెంకటరమణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్